క్లుప్తంగా

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. కర్నూలు నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లలో నేర చరిత్ర కలిగిన వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు, రౌడీ షీటర్లకు ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న నిమ్‌కార్ శివశంకర్‌రావు

కర్నూలు(అర్బన్): భావసార్ క్షత్రియులందరూ ఐకమత్యంగా ఉంటూ తమ సమాజానికి చెందిన వారికి సహాయ సహకారాలు అందించాలని సంఘం అధ్యక్షులు నిమ్‌కార్ శివశంకర్ రావు కోరారు. ఆదివారం స్థానిక రుక్మిణీ పాండురంగ స్వామి దేవాలయంలో భావసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాస విందు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పూజ, జ్యోతి ప్రజ్వలనతో కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివ శంకర్ మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో ఆర్థికంగా స్థిరపడిన భావసార్ క్షత్రియులు పేద, మధ్యతరగతి వర్గాల వారికి సహకారం అందించాలన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6న ఆషాఢ శుద్ధ తొలిఏకాదశి రోజున నిర్వహించిన పలు రకాల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందించారు. సమాజ్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక




రాఘవేంద్ర



అబ్దుల్లా

కర్నూలు(సెంట్రల్): ఇటీవల 11, 12 తేదీల్లో నిర్వహించిన డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలు విజయవంతం కావడంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆ సంఘం నాయకులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇప్పటివరకు జిల్లా కార్యదర్శిగా ఉన్న వై.నగేష్‌కు 40 ఏళ్లు రావడంతో అతను స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలగాడు. అతన్ని రాష్ట్ర ట్రెజరర్‌గా ఎంపిక చేశారు. ఇక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రాఘవేంద్ర, అబ్దుల్లాను ఎన్నుకున్నారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా హుస్సేన్‌బాషా, మైనా, శిరీష, వీరేష్, సహాయ కార్యదర్శులుగా ప్రకాష్, మధు, ఎంవీ వీరేష్‌తో పాటు 27 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా మాట్లాడుతూ.. యువతీ, యువకుల సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తామని, ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకుంటున్న ఫకృద్దీన్

కర్నూలు(రూరల్): గార్గేయపురం ప్రాథమిక వ్యవసాయ సహకర పరపతి సంఘం చైర్మన్‌గా ఫకృద్దీన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా జంబులయ్య, దిగువపాడు లక్ష్మిరెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ.. సుమారు 1,896 మంది సభ్యులు ఉన్న సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలకు కృషి చేస్తామన్నారు. సభ్యులు కూడా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. సహకర పరపతి సంఘం సీఈఓ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



హాలహర్వి: మండల కేంద్రం సమీపంలోని ఆలూరు–బళ్లారి ప్రధాన రహదారిపై తుఫాన్ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. కర్ణాటక రాష్ట్రంలోని మడికేరి నుంచి గుల్బర్గాకు వెళ్తున్న వాహనం అదుపు తప్పి బోల్తా పడిందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రయాణికులు తెలిపారు. గాయాలపాలైన వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం



'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి



హాజరైన కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి
- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి
- కార్యకర్తలను విస్మరించే ప్రసక్తే లేదు
- ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్
- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

కల్లూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్లూరు గ్రామీణ, కల్లూరు అర్బన్ వార్డుల మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. పార్టీలో రాష్ట్ర, జిల్లా, మండల విభాగాల్లో పదవులు పొందిన వారు, అర్బన్ 16 వార్డులు, గ్రామీణ మండలం ప్రాంతం నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని కాటసాని స్పష్టం చేశారు. గోరుకల్లు రిజర్వాయర్‌ను టీడీపీ నాయకులు తీసుకొచ్చినట్లు చెప్పుకుంటున్నారని, ఎవరి కాలంలో ప్రాజెక్టు శంకుస్థాపన జరిగిందో, ఎవరు ప్రారంభించారో ఇరిగేషన్ శాఖ రికార్డులను పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. వైఎస్సార్ హయాంలోనే గోరుకల్లు, హంద్రీనీవా, గాలేరు నగరి, ఎస్‌ఆర్‌బీసీ, గోరుకల్లు రిజర్వాయర్ ప్రాజక్టులను తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గోరుకల్లు రిజర్వాయర్‌కు గేట్లు ఏర్పాటు చేసి, 11 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో గత ఐదేళ్ల రైతులకు సాగు, తాగునీరు అందించామన్నారు.

స్థానిక ఎన్నికలపై దృష్టి

రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చూపుదామని కాటసాని శివనరసింహారెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాస్తున్నారని వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వ హామీలపై ప్రజల తరఫున పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ రేణుక, కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

ఎన్నికల సమయంలో అలవిగాని హామీలు ఇచ్చి సీఎం చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామన్నారు. ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రతి కుటుంబం ఎంత నష్టపోయిందో ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ – భవిష్యత్ గ్యారెంటీ' అని బాండ్లు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు భృతి ఇస్తామని, రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి వంటి పథకాలు ఇస్తామని ప్రగాల్భాలు పలికారని గుర్తు చేశారు. పొదుపు మహిళలకు రూ.10 లక్షలు బ్యాంకు లోన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నగరపాలకలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని, నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, అర్జీ పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు https://meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు అర్జీలను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దేవరగట్టులో విశేష పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు సుప్రభాత సేవ, అభిషేకాలు, భండారార్చన, పుష్పార్చన, మహామంగళ హారతి, ఆకుల అలంకరణ తదితర పూజలు జరిపించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

కూటమి పాలనలో మహిళలకు భద్రత ఏదీ?

- కామాంధులు రెచ్చిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది?
- రంగరాయ మెడికల్ కళాశాల ఘటనపై చర్యలేవీ?
- శాంతి భద్రతల పరిరక్షణలో సీఎం, డిప్యూటీ సీఎం, హోమంత్రి విఫలం



కల్లా నాగవేణి రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో కామాంధులు రెచ్చిపోతుంటే, ప్రభుత్వం ఏం చేస్తుందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేని రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో మహిళల రక్షణ పూర్తిగా కనుమరుగైందన్నారు. మహిళలపై రోజుకు 10 నుంచి 15 అఘాయిత్యాలు జరుగుతున్నా అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల బాత్రుమ్‌లో సీసీ కెమెరాలు పెట్టి ఇబ్బందులు పెట్టారని, రాజమండ్రిలో నర్సింగ్ విద్యార్థినిని వేధించారని, అనంతపురంలో ఇంటర్ విద్యార్థినిని టీడీపీ కార్యకర్తల గ్యాంగ్ ఆరు నెలల పాటు రేప్ చేశారన్నారు. తాజాగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్ నెల రోజులుగా విద్యార్థినుల శరీర భాగాలు ఫొటో తీసి బ్లాక్ మెయిల్ చేయడంపై బాధితులు ఫిర్యాదు చేసినా నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏ–1 గా ఉన్న కళ్యాణ్ చక్రవర్తిని తప్పించి ల్యాబ్ టెక్నీషియన్‌ను సస్పెండ్ చేశారన్నారు. ఇది కేవలం కంటి తుడుపు చర్య అని విమర్శించారు.

సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి విఫలం

రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా నిరోధించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మహిళా హోంమంత్రి వంగలపూడి అనిత ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ఆడపిల్లల జోలికి వస్తే తాట తీస్తా అని సినిమా డైలాగులు చెబుతున్న పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మహిళల రక్షణకు పాటుపడాల్సిన హోంమంత్రి ఆ బాధ్యతను గాలికి వదిలేసి నిత్యం వైఎస్ జగన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న అఘాయిత్యాలపై హోంమంత్రి నోరు విప్పాలన్నారు.

వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిపై ఫిర్యాదు

కర్నూలు(సెంట్రల్): సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఏపీ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేసినట్లు కర్నూలు జిల్లా అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న గుంటూరులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి తన సభ్యత్వాన్ని తొలగిస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. సంఘం నిబంధనల ప్రకారం రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలంటే 15 రోజుల ముందుగానే అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులుకు సమాచారం ఇవ్వాలని, అదేమీ చేయకుండా ఓ ప్రభుత్వ వాహన డ్రైవర్ సన్మాన సభనే రాష్ట్ర కార్యవర్గ సమావేశంగా చిత్రీకరించి తనపై వ్యక్తిగత కక్షతో వ్యవహరించడం అన్యాయమన్నారు. ఆయన వ్యవహార శైలిపై కేంద్ర సంఘానికి ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఆటో, ఆరు మోటార్ సైకిళ్లు స్వాధీనం
- 10 మందిపై కేసు నమోదు

కృష్ణగిరి: మండలంలోని రామకృష్ణాపురం గ్రామం నుంచి కోడుమూరు మండలం కొత్తపల్లి గ్రామానికి వెళ్లే దారిలో పొలంలో చెట్టు కింద జరుగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆదివారం దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. దాడిలో మండలంలోని టి.గోకులపాడుకు చెందిన లక్ష్మికాంతరెడ్డి, పుట్లూరుకు చెందిన అనంతయ్య, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బాలప్ప, ధనుంజయ, అమకతాడుకు చెందిన సుంకన్న, రామకృష్ణ, కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి, గోరంట్లకు చెందిన మాదన్న, లద్దగిరికి చెందిన రమేష్, కోడుమూరుకు చెందిన నబీరసూల్‌పై కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 30,150 నగదు, ఆటో, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అయితే అరెస్టు అయిన వారిలో ఎక్కువ మంది అధికార పార్టీకి చెందిన వారు ఉన్నట్లు సమాచారం.

ఆస్తిలో వాటా ఇవ్వలేదని ఆత్మహత్య

కర్నూలు రూరల్: తండ్రి ఆస్తిలో తనకు వచ్చే వాటా ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగలపాడుకు చెందిన సుజ్ఞానికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య చనిపోయిన తరువాత సుజ్ఞానం రెండో వివాహం చేసుకున్నారు. మొదటి భార్యకు ఒక కుమారుడు సురేష్ ఉన్నారు. రెండో భార్యకు కుమారుడు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. తల్లి చనిపోయిన తరువాత తండ్రి దగ్గరే పెరిగిన సురేష్ తెలంగాణ రాష్ట్రంలోని ఓ ప్రైవేటు బ్యాంకు ఫైనాన్స్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నారు. జోగులాంబ గద్వాలకు చెందిన గీతను సురేష్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటు కుటుంబ పోషణ భారం కావడంతో తండ్రి ఆస్తిలో తనకు వాటాగా వచ్చే ఆస్తిని ఇవ్వాలని కోరగా..అందుకు తండ్రి అంగీకరించకపోవడంతో మనస్తాపం చెందిన తన చావుకు కారణం తన తండ్రేనని, తనకు వాటాగా రావాల్సిన ఆస్తి ఇవ్వడం లేదని లేఖ రాసి శనివారం ఇంటి దగ్గరే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు పెద్దసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సురేష్ (39) చనిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నరేష్ తెలిపారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూసిటీ విభాగం మూడో నగర మహాసభలు జరిగాయి. ముందుగా ఆ కమిటీ నగర అధ్యక్షుడు కె.సుధాకరప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెండావిష్కరణ చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఎస్‌రాధాకృష్ణ, భవన నిర్మాణ సంఘం జిల్లా నాయకులు ఖాజా బాషా, గౌరవాధ్యక్షుడు టి.రాముడు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పలుమార్లు ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చినా పెడచెవిన పెడుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో కార్మికులు ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, అధ్యక్షుడిగా మాబాషా, ఉపాధ్యక్షులుగా కె.జసుధాకరప్ప, మద్దిలేటిని ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సౌధ ముట్టడి



పాతబస్తీలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రజల మెడలో ఉరితాళ్లుగా మారిన, విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దనే డిమాండ్‌తో సోమవారం (జూలై 14న) సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత సౌధను ముట్టడించనున్నారు. 'మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు.. మమ్మల్ని ముంచొద్దు' అన్న నినాదంతో ఇప్పటికే సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10 గంటలకు బళ్లారి చౌరస్తాలోని విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సీపీఎం ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రాముడు, ఎం.రాజశేఖర్, సుధాకరప్ప మాట్లాడుతూ.. ప్రజల సొమ్మును అదానీకి దోచిపెట్టడానికే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు అధికారంలోకి లేని సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి..అధికారంలోకి రాగానే ఒప్పుకోవడం అన్యాయమన్నారు. మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని చెప్పి.. ఇప్పుడు మాత్రం నోరు మెదకపోవడం అన్యాయమన్నారు.

పూడిక తీసి వదిలేశారు!



హెడ్ పోస్టాఫీసు వద్ద డ్రైనేజీలోని పూడిక, మట్టిని తవ్వి రోడ్డుపై వేసిన దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): పాత బస్టాండులోని హెడ్ పోస్టాఫీసు వద్ద విద్యుత్ స్తంభాల మార్పు కోసం డ్రైనేజీలో పూడిక, మట్టిని తవ్వి వదిలేశారు. వారం రోజులవుతున్నా పనులు పూర్తి చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు వాహనాల రాకపోకలు సాగుతుండగా పాదచారులు నడుచుకుంటూ వెళ్లాలంటే ఎక్కడ బురద మట్టిలో పడిపోతామేమోనని ఆందోళనకు గురవుతున్నారు. కర్నూలుకు తలమానికమైన కొండారెడ్డి బురుజు వద్ద మురుగునీటి కాల్వలో పూడికను తీసి వదిలేయడంతో కంపుకొడుతోంది. పనులు పూర్తి చేయకపోవడంతో 'ఇదేనా స్మార్ట్ సిటీ' అని పాదచారులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ, విద్యుత్ శాఖ అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

నాటు సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌తో ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో నాటుసారాను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రహాస్ తెలిపారు. ఉలిందకొండ గ్రామానికి చెందిన గొల్ల రమేష్, కొల్లంపల్లి తాండకు చెందిన తెలుగు రామాధాసు నాటుసారాను తీసుకొని బజాజ్ ద్విచక్రవాహనంపై గార్గేయపురం గ్రామానికి తీసుకపోయారు. ఆ గ్రామానికి చెందిన బైనేని సురేష్ ఇంటి ముందు బైక్‌పై నుంచి నాటు సారాను దింపుతుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గొల్ల రమేష్, బైనేని సురేష్‌లను పట్టుకోగా, తెలుగు రామదాసు ఎక్సైజ్ పోలీసులను చూసి పారిపోయారు. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కర్నూలు ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు నాటు సారా విక్రయించేవారిని తమకు వచ్చిన సమాచారం మేరకు చేసిన దాడుల్లో 40 లీటర్ల నాటు సారా, బైక్‌ను స్వాధీనం చేసుకొని పట్టుబడిన ఇద్దరు, పారిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రహాస్ తెలిపారు. పారిపోయిన వ్యక్తిని సైతం త్వరలోనే అరెస్ట్ చేస్తామని, ఈ దాడుల్లో పాల్గొన్న సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నవీన్ బాబు, కానిస్టేబుల్స్ ఈరన్న, మధు, సూర్యనారాయణ, ఎం.రాజు, సుదర్శన్, రాజులు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు.

మతోన్మాదాన్ని అంతమొందించాలి

- దేవాలయాల్లో అన్యమత ఉద్యోగుల తొలగింపునకు చర్యలు శూన్యం
- విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రామినూతల శశిధర్



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రామినూతల శశిధర్

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలో మతోన్మాద భావజాలాన్ని అంతమొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రామినూతల శశిధర్ అన్నారు. ఆయన ఆదివారం కర్నూలులో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ప్రమాదంలో నెట్టేసే విధంగా ఉగ్రవాద కదలికలు నడుస్తున్నాయన్నారు. దేశంలో 15 ప్రాంతాల్లో ఉగ్రవాద కదలికలు ఉన్నట్లు గుర్తిస్తే ఏపీలోని రాయలసీమలో కూడా ఉన్నట్లు తెలిసిందన్నారు. యువతను లక్ష్యంగా చేసుకొని కార్యకలాపాలు సాగిస్తున్నారని, అన్నమయ్య జిల్లా ఎస్పీని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో అన్యమతస్తుడు ప్రార్థన చేయడం ఏమిటన్నారు. ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది దాటినా ఆ దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. సనాతన ధర్మ పట్లం గౌరవం ఉంటే ప్రసాదంలో బొద్దింకలు పడటం లాంటి పరిస్థితులు ఉండవన్నారు. ప్రజల విశ్వాసాలను పదే పదే గాయపరిచేలా చేస్తున్నారన్నారు. శ్రీశైలంలో షాపింగ్ కాంప్లెక్స్ ముస్లింల ఆక్రమణలోకి వెళ్లిపోయిందన్నారు. హిందూ భక్తులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. పుణ్య క్షేత్రాల పవిత్రతను దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయని, దీన్ని ప్రభుత్వం నిలువరించాలన్నారు. ఆలయాల ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య, రాష్ట్ర మీడియా కన్వీనర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: సనాతన ధార్మిక జీవనమే విశ్వ కళ్యాణ కారకమని పలువురు వక్తలు అన్నారు. కర్నూలు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆదివారం హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాకలూరు శారదా పీఠం అధిపతి శివ యోగీంద్ర సరస్వతి, జూటూరు శ్రీ గురు సిద్ధ నాగసాయి బ్రహ్మ విద్యాశ్రమం పీఠాధిపతి శ్రీ సద్గురు రామానంద స్వామి, భగవాన్ ధన్వంతరి యోగాశ్రమం నిర్వాహకులు డాక్టర్ పద్మానంద యోగి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, నల్లగుట్ట శ్రీకూర్మం క్షేత్రం నిర్వాహకులు నరేష్, స్వాత్మానంద స్వామి తదితరులు పాల్గొని మాట్లాడారు. ధార్మిక సంస్థల్లో అంతర్గత అనైక్యతను పోగొట్టడానికి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలన్నారు. పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టాలన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విశ్వశాంతిని ఆకాంక్షించే ధర్మం సనాతనం అని, ధర్మాన్ని అవలంభించినప్పుడే విశ్వ కల్యాణం సాకారం అవుతుందన్నారు. కార్యక్రమ సమన్వయకర్తగా డాక్టర్ తొగట సురేష్‌బాబు వ్యవహరించారు. వివిధ జిల్లాల నుంచి పూజ్య స్వామీజీలు, హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కేంద్ర సమితి జిల్లా కార్యదర్శిగా రమణ

కర్నూలు కల్చరల్: గణేష్ ఉత్సవ కేంద్ర సమితి జిల్లా కార్యదర్శిగా గోరంట్ల రమణ నియమితులయ్యారు. ఈయన గతంలో జిల్లా ఈత సంఘం అధ్యక్షులుగాను, నిర్మాణదారుల సంఘం (క్రెడాయి, కర్నూలు) కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పని చేసి అనేక సాంఘిక కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం క్రెడాయ్ కర్నూలు చాప్టర్‌కు చైర్మన్‌గా సేవలందిస్తున్నారు. గతంలో విశ్వ హిందూ పరిషత్ నగర, జిల్లా అధ్యక్షులుగా పని చేసి క్రియాశీలక పాత్ర పోషించారు. విశ్వహిందూ పరిషత్ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రచారం చేసి, హిందువులను సంఘటితం చేసేందుకు కృషి చేశారు.

ఈగలు ముసిరి.. రోగాలు ప్రబలి



కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎదురుగా చెత్తచెదారంతో నిండిన కాల్వ



వడ్డెగేరిలో నడిరోడ్డుపై వేసిన చెత్తచెదారం, మాంసం వ్యర్థాలు



కింగ్‌మార్కెట్‌లో కుళ్లిన మామిడిపండ్లను రోడ్డుపై వేసిన దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలోని పలు కాలనీల డ్రైనేజీల్లో చెత్తచెదారం, వ్యర్థాలు పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. అసలే వర్షాకాలం ఆపై ఈగలు ముసిరి.. రోగాలు ప్రబలే ప్రమాదం ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కర్నూలు అర్బన్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎదురుగా ఉన్న కాల్వ చెత్తచెదారం, వ్యర్థాలతో నిండిపోయి మురుగునీరు పారకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే సమీపంలోని సీపీఎం కార్యాలయం వెనుక భాగంలో మురుగునీటి కాల్వలో చెత్తచెదారం వేయడంతో కాల్వ వ్యర్థాలతో నిండిపోయింది. అదే ప్రాంతంలో ఎక్కడబడితే అక్కడ మలమూత్ర విసర్జన చేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. వడ్డెగేరిలో చెత్తచెదారం, మాసం వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు పడేయడంతో ఈగలు, దోమలు ముసురుకున్నాయి. దీంతో రోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.